
## చంద్రన్న వస్తున్నాడు.. పండుగ తెస్తున్నాడు..

**మడకశిర రూరల్:** సీఎం చంద్రబాబునాయుడు గురువారం గుండుమల గ్రామానికి వస్తుండడంతో ప్రజలు పండుగ చేసుకోనున్నారు. పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు పండుగ చేసుకోనున్నారు. పం చాయితీ పరిధిలో మొత్తం ఏడు గ్రామాలున్నాయి. వాటి పరిధిలో 3158 కుటుంబాలున్నాయి. అందులో 398 మందికి రూ.16.87 లక్షలు పింఛన్ల సొమ్ము పంపిణీ చేయనున్నారు. చంద్రబాబు రానుండడంతో ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామంలోని కరియమ్మ దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అన్ని గ్రామాల్లో పారిశుధ్య చర్య లు చేపట్టారు. గురువారం ప్రతి గ్రామంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, చంద్రన్న పండుగ చేసుకోనున్నట్లు ప్రజలు తెలిపారు.


కియ కార్ల పరిశ్రమ



### విద్య, వైద్యానికి పెద్దపీట వేయాలి

జిల్లావాసులకు విద్య వైద్యానాకి అనంతపురమే దిక్కు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో సీహెచ్‌సీలు 7, ఏరియా ఆస్పత్రులు 3, హిందూపురంలో జిల్లా వైద్యశాల ఉంది. ప్రభుత్వాస్పత్రుల్లో 171 మంది వైద్యులకుగాను 137 మందే ఉన్నారు. అన్నిచోట్లా సిబ్బంది కొరత ఉంది. పెనుకొండలో నిర్మాణం చేపట్టిన వైద్య కళాశాల పనులు 13 శాతమే పూర్తికాగా.. రూ.35కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టారు. ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. విద్యాశాఖ పరిధిలో చాలా ప్రభుత్వ పాఠశాలల్లో గత ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనులు కొనసాగుతూనే ఉన్నాయి. అసౌకర్యాల నడుమ విద్యార్థులు చదువుకోవాల్సి వస్తోంది. ఉన్నత విద్య చదవాలనుకుంటే జిల్లాలోని విద్యార్థులు అనంతతోపాటు ఇతర జిల్లాలకు పరుగులు పెటాల్సి వస్తోంది. ఉద్యోగం, ఉపాధి కావాలంటే కర్ణాటకకు వలన వెళ్లాల్సి వస్తోంది.

### ఆ ఇళ్ల సంగతేంటి..?

జిల్లాలో పక్కా ఇళ్ల నిర్మాణం పేరుతో గత వైసీపీ ప్రభుత్వం జగనన్న లేఅవుట్ల ఏర్పాటు చేసింది. అందులో ఆ పార్టీ నాయకులు దందా చేశారు. పేదల పేరుతో విలువైన ఇళ్ల స్థలాలను కొట్టేశారు. జిల్లాలోని 298 లేఅవుట్లలో 30985 మంది, సొంత స్థలాల్లో 28918 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు. జిల్లావ్యాప్తంగా 66,393 ఇళ్లు మాంజూరు కాగా.. 19491 మాత్రమే పూర్తిచేశారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నట్లు హౌసింగ్ శాఖ చెబుతోంది. జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణం 2018-19లో 90శాతం పూర్తి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటికి రంగులు వేసి, లబ్ధిదారులకు అప్పగించకుండా అలాగే వదిలేశారు. కూటమి సర్కారు ఇప్పుడు టిడ్కో ఇళ్లకు సదుపాయాలు కల్పించి, అందజేస్తే అబ్ధిదారులు సంతోషిస్తారు. 2016-2019 మధ్య జిల్లాలో నిర్మాణం చేపట్టిన 23,647 ఇళ్లకు ఇంకా రూ.32 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది.

# ఆశలన్నీ మీపైనే.. బాబూ..

నేడు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన


మడకశిర ఉపకాలువ దుస్థితి


బందీఖానాలో ఉన్న లేపాక్షి హబ్ భూములు

**పుట్టపర్తి, జూలై 31(ఆంధ్రజ్యోతి):** జిల్లా ప్రజల ఆర్థికాభివృద్ధికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సరిగ్గా ఏడేళ్ల కిందట కరువు అని చెప్పుకునే ఉమ్మడి జిల్లాను వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి దిశగా పరుగులు పెట్టింది. సాగుపై ఆశలు వదులుకున్న ఉమ్మడి అనంత జిల్లా రైతాంగంపై చంద్రబాబు ప్రత్యేక చొరవ చూపి హంద్రీనీవా కాలువ ద్వారా జిల్లాకు కృష్ణా జలాలను తీసుకొచ్చారు. రిజర్వాయర్లు, చెరువులకు నీరు చేరి ఏళ్లుగా బీడుగా మారిన ఆయకట్టు సాగులోకి వచ్చింది. రైతన్నల్లో ఆనందం నిండింది. కార్ల పరిశ్రమను తీసుకొచ్చి జనం తలసరి ఆదాయాన్నే మార్చేశారు. అంతర్జాతీయ కార్ల దిగ్గజం కియతోపాటు అనుబంధ, కేంద్ర సంస్థలు రావడంతో రైతు, యువతకు ఉపాధి అవకాశాలు వెల్లువెత్తాయి. జిల్లా ప్రజల ఆర్థికాభివృద్ధికి బీజం పడింది. జిల్లా పారిశ్రామిక హబ్‌గా అవతరించింది. ప్రపంచ పారిశ్రామిక వేత్తల చూపు శ్రీసత్యసాయి జిల్లావైపు మళ్లింది. కియ కార్ల పరిశ్రమతో ప్రస్తుతం ఆటోమొబైల్ హబ్‌గా అవతరించింది. భవిష్యత్తులో హైదరాబాద్-వైజాగ్-చెన్నై, బెంగళూరు-ఉమ్మడి అనంత జిల్లా పారిశ్రామిక కారిడార్‌కు బలం చేకూరి ఉపాధి కల్పన జిల్లాగా మార్చేసింది. ఇక అభివృద్ధి పరుగులే అని అందరూ భావించిన సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్ల విధ్వంస పాలనలో జిల్లాలో అభివృద్ధి జాడ కనిపించకుండా పోయింది. అన్ని రంగాలూ కుదేలయ్యాయి. వ్యవసాయ, పారిశ్రామిక, సాగునీటి ప్రాజెక్టులతోపాటు పలు రంగాలపై నిర్లక్ష్య వైఖరితో అభివృద్ధికి అటకెక్కింది. గత ఐదేళ్ల విధ్వంసాన్ని పూడ్చాల్సిన బాధ్యత ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై పడింది. గురువారం మడకశిర మండలం గుండుమలలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో మళ్లీ అభివృద్ధి పుంజుకుంటుందనీ, పూర్వ వైభవం వస్తుందని ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి.

### కరువు రైతుకు చేయూతనిస్తేనే...

గత ఐదేళ్లూ అతివృష్టి, అనావృష్టితో రుణభారమైనా సాగు చేసిన పంటలు చేతికందక రైతన్నలకు అప్పులే మిగిలాయి. గత ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావంతో జిల్లా అంతటా కరువు ఛాయలు అలుముకున్నాయి. 2022-23 ఖరీఫ్‌లో 14 మండలాలను మాత్రమే కరువు జాబితాలో చేర్చి, మిగిలిన వాటికి మొండిచేయి చూపారు. 2023-2024లో రబీ సీజన్‌లో రొద్దం మండలంలోనే తీవ్ర కరువు ఉన్నట్లు ప్రకటించి చేతులు దులుపుకున్నారు. ఇంకా చాలామంది రైతులకు నేటికీ పరిహారమే అందక ఎదురుచూసే పరిస్థితి దాపురించింది. ఏటా పంట సాగులో వందల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టపోయిన రైతుకు మాత్రం గత వైసీపీ ప్రభుత్వం భరోసా ఇవ్వలేకపోయింది. రైతుకు అందించే ఎరువులు, విత్తనాలు, బిందు సేద్యం పరికరాలపై సబ్సిడీలు ఎత్తివేయడంతో పెట్టుబడులు పెరిగిపోయాయి. తీవ్ర సంక్షోభంలో ఉన్న వ్యవసాయం ముందుకు సాగాలంటే రైతును అన్నివిధాలా ఆదుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత ఖరీఫ్‌లో పదును వానలేక 2.8 లక్షల హెక్టార్లకుగాను 47 శాతమే పంట సాగైంది. గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా జిల్లా వరప్రదాయినిగా భావించే హంద్రీనీవా కాలువ నీటితో రిజర్వాయర్లు, చెరువులను నింపకుండా రెండేళ్లుగా ఎండబెట్టారు. గత ప్రభుత్వం పట్టు రైతుకు ప్రోత్సాహకం కూడా ఇవ్వలేదు. ఏకంగా పట్టు రైతుకు రూ.కోట్లలో బకాయి పెట్టింది. ఉద్యాన రైతులకు ప్రోత్సాహకాలు అందక సాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోయింది. జిల్లా నుంచి ఉత్పత్తులు తగ్గిపోతున్నాయి. రుణభారం కూడగట్టుకున్న రైతుకు చేయూతనిచ్చి, ప్రతి చెరువును నింపి వ్యవసాయాన్ని పండుగలా మార్చాలి.

### మళ్లీ జలహారతి పట్టాలి

జిల్లాలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకంతోపాటు చిన్న, మధ్యతరహా, భారీ సాగునీటి ప్రాజెక్టులపై గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగలేదు. పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. మూలనపడేశారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వ హయంలో శ్రీకారం చుట్టిన అభివృద్ధి ప్రాజెక్టులను అటకెక్కించడంతోపాటు వైసీపీ విధ్వంస పాలనలో కొత్తగా ఒక్క సాగునీటి ప్రాజెక్టును కూడా తీసుకురాలేదు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద రూ.591.57 కోట్లతో జీడిపల్లి జలాశయం నుంచి ఎగువ పెన్నార్ ప్రాజెక్టు పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి జలాశయాలకు నీటి సరఫరా ఎత్తిపోతల పథకం పనులు 2018 ఆగస్టు ఒకటిన ప్రారంభిస్తే ఐదేళ్లలో అడుగు కూడా ముందుకు పడలేదు. చిలమత్తూరు, గోరంట్ల మండలాలకు తాగు, సాగు నీరివ్వాలన్న సంకల్పంతో హంద్రీనీవా సుజల స్రవంతి మడకశిర ఉపకాలువ దేమకేతపల్లి నుంచి 160 చెరువులకు ఎత్తిపోతల ద్వారా నీరందించే పథకానికి రూ.510 కోట్లతో డీపీఆర్ 2018లోనే సిద్ధం చేశారు. సాంకేతిక అనుమతుల కోసం ప్రతిపాదన పంపగా.. దానినీ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు మరుగున పడేశారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు అంచనా విలువ మరో రూ.200 కోట్లు పెరిగిపోయింది. 2018లోనే టీడీపీ ప్రభుత్వ హయాంలో మడకశిర నియోజక వర్గంలో రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధ చేశాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో అవి అడుగు కూడా ముందుకు పడలేదు. అదే నియోజకవర్గంలో శాశ్వతంగా తాగు, సాగునీటి సమస్య పరిష్కరించడానికి హంద్రీనీవా పథకం ద్వారా రాళ్లపల్లి, రత్నగిరి వద్ద రిజర్వాయర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినా.. గత వైసీపీ పాలకులు ఐదేళ్లూ అటువైపు కూడా చూడలేదు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద ముదిగుబ్బ మండలం గుడ్డంపల్లి తండా వద్ద నిర్మాణం చేపట్టిన జిల్లేడుబండ ప్రాజెక్టు పనులు అర్ధంతరంగా నిలిపోయాయి. హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు నీరు ఇచ్చే జీడిపల్లి-కుప్పం, గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర ఉపకాలువ గట్టు బలహీనంగా ఉంది. ఏటా గండ్లు పడుతూ నీరు ముందుకు కదలడం కష్టతరంగా మారింది. రాప్తాడు నియోజకవర్గానికి సాగునీరు అందించే హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద గత వైసీపీ ప్రభుత్వం రూ.803 కోట్లతో ముట్టాల, తోపుదుర్తి, దేవకొండ వద్ద మూడు జలాశయాలు నిర్మించడానికి 2020 డిసెంబరు 9న చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి వద్ద శంకుస్థాపన చేసి, వదిలేశారు. నేటికీ శిలాఫలకాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. వీటన్నింటినీ పునరుద్ధరించి, ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలని జిల్లావాసులు కోరుతున్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 193 చెరువులకు హంద్రీనీవా కాలువ నుంచి ఎత్తిపోతల పథకం పనులు వేగం పెంచాలి. ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లి వద్ద ప్రారంభమయ్యే కదిరి ప్రధాన కాలువ పనులు గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 5 శాతం కూడా పూర్తి చేయపోవడంతో నియోజకవర్గంలో నీరు సమస్య నెలకొంది. ఇలా జిల్లాలో చాలా సాగునీటి ప్రాజెక్టులను పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. మడకశిర ఉపకాలువ వెడల్పు చేసి, నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీరందించాలి.

### లేపాక్షి హబ్ చిక్కుముడి వీడాలి

లేపాక్షి హబ్ బందీఖానాలో 8844 ఎకరాల భూములున్నాయి. గత ఐదేళ్లూ అధికారంలో ఉన్న వైసీపీ ఆ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఎలాంటి ప్రయత్నం చేయకపోగా.. దివాళాపేరుతో భూములను ధారదత్తం చేసేందుకు ప్రయత్నించింది. లేపాక్షి హబ్ భూములను తాకట్టు పెట్టి రుణం తీసుకోవడంపై విచారణకు 2014-19లో టీడీపీ ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. అప్పులిచ్చిన బ్యాంకులకు లేఖలు రాశారు. కర్ణాటక సరిహద్దులో వేలాది ఎకరాల భూములు లేపాక్షి హబ్ చేతిలో చిక్కుకున్నాయి. ఆ చిక్కుముడి విడిపించి, స్వాధీనం చేసుకుని ఐటీ ఆధారిత పరిశ్రమలు తీసుకొచ్చే ప్రయత్నాలు చేశారు. 2019లో పాలకపక్షం మారడంతో ఆ ప్రతిపాదన నిలిచిపోయింది. గత వైసీపీ ప్రభుత్వం 2022లో ఢిల్లీ సంస్థ నుంచి కేవలం రూ.5 కోట్లు తీసుకున్న లేపాక్షి రూ.1600 కోట్లకు పైగా విలువచేసే 2650 ఎకరాలకు భూమి ప్రైవేటుకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసింది. కొన్నాళ్లుగా లేపాక్షి హబ్ భూములను రైతులకు వెనక్కివ్వాలంటూ నిర్వాసిత రైతుల హక్కుల పరిరక్షణ వేదిక, అఖిలపక్షం పేరుతో రైతుల పక్షాన టీడీపీతోసహా అఖిల పక్ష, రైతు సంఘాల నేతలు, రైతులు ఉద్యమబాట పట్టారు. నిరసనలు తెలిపారు. కూటమి అధికారంలోకి రావడంతో ఉమ్మడి అనంత జిల్లాలో మళ్లీ పారిశ్రామికాభివృద్ధికి బాటలు పడనున్నాయి. పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తోంది. లేపాక్షి హబ్ వెనుక మాజీ సీఎం జగన్ బినామీలు ఉన్న నేపథ్యంలో 15 ఏళ్లుగా భూములు బందీఖానాలో చిక్కుకున్నాయన్నది బహిరంగ రహస్యమే. ఈ భూములపై చిక్కుముడి వీడి పారిశ్రామికాభివృద్ధికి అడుగులు పడేలా చర్యలు చేపట్టాలనీ, ఐటీ కారిడార్ ఏర్పాటు చేయాలని భూములిచ్చిన రైతులు కోరుతున్నారు.

### పారిశ్రామిక అగ్రగామిగా...

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అప్పటి సీఎం జగన్ గ్లోబుల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023 పేరుతో విశాఖ వేదికగా నిర్వహించిన పెట్టుబడుల ఆకర్షణ సదస్సులో రూ.13 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు ఇచ్చాయని గొప్పలు చెప్పారు. ప్రకటనలే తప్ప.. జిల్లాలో ఒక్క కొత్త పరిశ్రమ ఏర్పాటైంది లేదు. కొత్తగా ఉద్యోగావకాలు కల్పించిందీ లేదు. వచ్చిన పరిశ్రమలను పక్కరాష్ట్రాలకు పరుగులు పెట్టించారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూములను 2024-19 మధ్య టీడీపీ హయాంలోనే గుర్తించారు. గోరంట్ల, సోమందేపల్లి, పాలసముంద్రం, గుడిపల్లి వద్ద 2015లో ప్రపంచంలోనే అత్యున్నత శ్రేణి నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఎక్సైజ్ నార్కొటిక్స్ (నాసిన్), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) భారీ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారు. ప్రధాని చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించారు. పెనుకొండ, పాలసముద్రం, కప్పలబండ, హిందూపురం, మడకశిర రాళ్లఅనంతపురం, గోళ్లాపురం, గుడిపల్లి, దాదులూరు, శెట్టిపల్లి, సడ్లపల్లి, కొటిపి, కేతిగానిచెరువు, కుటాగుళ్ల వద్ద పరిశ్రమల కోసం 8 వేల ఎకరాలకుపైగా భూములు గుర్తించగా.. వేల ఎకరాలు సిద్ధంగా ఉన్నాయి. పారిశ్రామిక వాడల్లో 1292 ప్లాట్లు 1470 ఎకరాల భూమి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన పారిశ్రామిక వ్యతిరేక విధానాల కారణంగా ఆ రంగం అభివృద్ధి అటకెక్కింది. పరిశ్రమల స్థాపనకు అనువైన భూలున్నా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రాలేదు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ జిల్లావాసుల్లో ఆశలు రేకెత్తాయి. లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న నమ్మకం పెరిగింది. తాజాగా కేంద్ర బడ్జెట్‌లో హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తామన్న ప్రకటనతో జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి మరింత పరుగులు పెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్ వే వెంట పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేసి, వాటికి ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటించింది. అంతర్రాష్ట్ర, జిల్లా రహదారులను అనుసంధానం చేస్తూ జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణకు కేంద్రం సహకారం అందించేందుకు ప్రాథమికంగా ఆమోదం తెలిపింది. ఇది జిల్లాలో అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది.



## సాదాసీదాగా..

ప్రజావేదిక సిద్ధం.. సీఎం పర్యటన ఏర్పాట్లు పూర్తి
పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యేలు
భారీ బందోబస్తు ఏర్పాటు


సభావేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

**మడకశిర, జూలై 31:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని గుండుమల గ్రామంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆ గ్రామస్థులను మాత్రమే అనుమతించనున్నారు. గ్రామంలోని కరియమ్మ దేవాలయంలో వేదికను ముస్తాబు చేశారు. సాదాసీదాగా సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలుత పింఛన్లు పంపిణీ చేయనున్నారు. అనంతరం ప్రజావేదికపై నుంచి ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తరువాత మల్బరీషెడ్డును పరిశీలించనున్నారు. కరియమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో సీఎం పర్యటన ముగియనుంది. ఏర్పాట్లను గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప పరిశీలించారు. చంద్రబాబు సభకు గుండుమల వాసులను మాత్రమే అనుమతిస్తుండడంతో మిగతా గ్రామాల ప్రజలు వీక్షించేందుకు వీలుగా ఆయా ఊర్లలో ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేశారు.

### పటిష్ట భద్రత

సీఎం పర్యటన ఏర్పాట్లలో భాగంగా హెలీప్యాడ్, కాన్వాయ్ రిహార్సల్స్‌ను కలెక్టర్ టీఎస్ చేతన్ పర్యవేక్షించారు. భద్రతా ఏర్పాట్లను డీఐజీ బాజీజాన్‌సాయ, జిల్లా ఎస్పీ రత్న పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు డీఐజీ తెలిపారు. ఆరుగురు డీఎస్పీలు, 26 మంది సీఐలు, 64 మంది ఎస్ఐలు, 178 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 368 మంది పోలీసులు, 42 మంది మహిళా సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నట్లు ఆయన వెల్లడించారు.


గుండుమలలో బందోబస్తుకు వచ్చిన పోలీసులు

## జంగం మఠం భూములు పేదలకు పంచాలి

సీఎం చంద్రబాబుకు సీపీఐ నేతల వినతి

**ధర్మవరం, జూలై 31:** బత్తలపల్లిలోని నిడిమామిడి జంగం మఠం భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడి, పేదలకు పట్టాలివ్వాలని సీపీఐ నేతలు.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విన్నవించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును విజయవాడలోని ఆయన కార్యాలయంలో బుధవారం సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఇతర నేతలు కలిసి, వివిధ సమస్యలపై చర్చించారు. రాష్ట్రంలో పేదల భూములు అన్యాక్రాంతం కాకుండా విచారణ చేపట్టాలని కోరారు. బత్తలపల్లిలోని నిడిమామిడి జంగం మఠానికి చెందిన దాదాపు 20 ఎకరాల భూమిని వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అనుచరులు నకిలీ రిజిస్ట్రేషన్ చేయించుకుని, పిత్రార్జితంగా వచ్చినట్లు చూపి కబ్జా చేశారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆ భూమిని స్వాధీనం చేసుకుని, పేదలకు ఇంటిపట్టాలు ఇవ్వాలని కోరినట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన వెల్లడించారు.

### ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా

బత్తలపల్లిలోని నిడిమామిడి జంగం మఠం భూమిలో పేదలకు ఇళ్లపట్టాలివ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, రాష్ట్ర నాయకుడు జింకా చలపతి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, పేదలు బుధవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. మధు మాట్లాడుతూ.. జాతీయ రహదారికి అనుకుని ఉన్న మఠం భూమికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అనుచరులు పట్టాలు చేయించుకోవడం, పిత్రార్జితం అన్నట్టు రికార్డులు కూడా సృష్టించడం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. కబ్జాదారులకు జైలుకు పంపేవరకు పోరాటం ఆపమన్నారు. మఠం భూమిలో పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారి లక్ష్మీదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, పేదలు

# ఇక సిరికల్చరే!

- వైసీపీ పాలనలో నిర్వీర్యమైన సెరికల్చర్
- కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం
- రూ.10 కోట్ల రాయితీ నిధుల విడుదల
- మరిన్ని ప్రోత్సాహకాల కోసం రైతుల ఎదురుచూపు

**అనంతపురం సెంట్రల్, జూలై 31:** గత వైసీపీ ప్రభుత్వంలో ప్రోత్సాహం కరువైన పట్టుపరిశ్రమ చంద్రబాబు రాకతో కోలుకుంటోంది. గత ఐదేళ్లలో జిల్లా పట్టు రైతులకు వైసీపీ ప్రభుత్వం కోట్ల రూపాయల ప్రోత్సాహకాలు పెండింగ్‌లో పెట్టింది. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన కొద్ది రోజుల్లోనే ప్రభుత్వ రాయితీ బకాయిలు రూ. పది కోట్లు విడుదల చేశారు. దీంతో జిల్లా పట్టు రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 70వేల ఎకరాల్లో వేలాది మంది రైతులు మల్బరీ సాగుచేస్తున్నారు. ఈ సాగు ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా లక్ష కుటుంబాలకుపైగా ఉపాధిని పొందుతున్నాయి. ఈ నేపథ్యంలో మల్బరీ సాగును ఉపాధి హామీ పథకంతో అనుసంధానించి, షెడ్ సైడ్‌వాల్స్ రేకులు, రొటోవేటర్, కట్టర్లు, విజేత పౌడర్లు తదితర వాటిని అందజేయాలని రైతులు కోరుతున్నారు. మల్బరీ సాగుకు ఆలవాలమైన మడకశిర ప్రాంతానికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వస్తున్న నేపథ్యంలో పట్టు రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు ప్రకటించాలని కోరుతున్నారు.

### 70వేల ఎకరాల్లో మల్బరీ సాగు...

ఉమ్మడి జిల్లాలో పట్టు సాగు చేసే ప్రాంతాలను బట్టి మడకశిర, హిందూపురం, కదిరి, పెనుకొండ, ధర్మవరం, కళ్యాణదుర్గం, అనంతపురం డివిజన్లుగా ఏర్పాటు చేశారు. ఒక్కో డివిజన్‌కు అడిషనల్ డైరెక్టర్(ఏడీ), సెరికల్చర్ ఆఫీసర్(ఎస్ఓ)లు ఉంటారు. వారి పరిధిలో అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్(ఏఎస్ఓ)లు, టెక్నికల్ ఆఫీసర్లు(టీఓ), అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్లు(టీఓ), ఫీల్డ్ అసిస్టెంట్లు(ఎఫ్ఏ) క్షేత్రస్థాయిలో రైతులవద్ద కెళ్లి మల్బరీ సాగుపై అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి సాగుకు అవసరమైన వసతులు, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో దాదాపు 70వేల ఎకరాల్లో మల్బరీ పంటను సాగుచేస్తూ 10వేల షెడ్లలో పట్టు పురుగులు పెంచుతున్నారు. రైతుల వివరాలు, సాగు విస్తీర్ణం, ప్రభుత్వ పథకాలు, రాయితీలు వంటి వివరాల క్రోడీకరణ, వాటి అమలు కార్యక్రమాలను కార్యాలయ సూపరింటెండెంట్‌తో పాటు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు పరిశీలిస్తారు. పట్టుపరిశ్రమ శాఖను జాయింట్ డైరెక్టర్(జేడీ) దుగ్గిరాల పద్మమ్మ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్(డీడీఎస్) ఆంజనేయులు పర్యవేక్షిస్తున్నారు.



రైతులకు పొలంలో సూచనలు ఇస్తున్న ఏడీ రామకృష్ణ

### రూ.10 కోట్ల సొమ్ము జమ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మల్బరీ సాగును ప్రోత్సహిస్తున్నాయి. ఇందులో భాగంగా ప్లాంటేషన్, డ్రిప్ ఏర్పాటు, షెడ్డు నిర్మాణం, పట్టు గూళ్ల పెంపకం, అమ్మకాలు, రీలింగ్ యూనిట్ ఏర్పాటు తదితర వాటికి రాయితీలను అందిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రాయితీలను ఎత్తివేసి పట్టుపరిశ్రమను నిర్వీర్యం చేశారు. అంతేకాక కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.వందల కోట్ల నిధులను సైతం పక్కదారి మళ్లించారు. దీంతో అనేకమంది రైతులు మల్బరీ సాగును వదిలేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు పట్టు రైతుల్లోని నైరాశ్యాన్ని తుడిచివేసే చర్యలను చేపట్టారు. ఇందులో భాగంగా రూ.10కోట్ల రాయితీల బకాయి సొమ్మును పదిరోజుల కిందట విడుదల చేశారు. వాటిని నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లోకే ప్రభుత్వం జమచేసిందని పట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



**రూ.మూడు లక్షల రాయితీ**

58 ఇంటు 25 చదరపు అడుగుల విస్తీర్ణంలో రేషం షెడ్డు నిర్మించుకున్నా. ఇందుకు రూ.3లక్షల రాయితీని ప్రభుత్వం చెల్లించింది. కొమ్మమేత స్టాండ్లకు రూ.3412 రాయితీ ఇచ్చారు. ఈ మొత్తం సొమ్మును నేరుగా బ్యాంకు ఖాతాకే అధికారులు జమచేశారు. సకాలంలో రాయితీలను అందజేస్తే మరింత ఉత్సాహంతో పని చేయవచ్చు.

- ఆనందప్ప, పట్టురైతు, గుండుమల



**చంద్రబాబుతోనే రైతులకు మేలు**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పరిపాలనలోనే పట్టు రైతులకు మేలు జరుగుతోంది. సకాలంలో రాయితీలు విడుదల చేయడం, అధికారులను అప్రమత్తం చేయడం, ఎప్పటికప్పుడు సమీక్షించి లోపాలను గుర్తించడంలో ఆయన దిట్ట. సీఎం కాగానే రూ.లక్ష రాయితీని చెల్లించారు. ఇంకా సూట్, నర్సరీ బిల్లులు రావాలి.

- అనిల్‌కుమార్, పట్టురైతు, ఓబగానిపల్లి



**ఉపాధి హామీ పథకంలో చేర్చాలి**

ఐదు ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నా. మల్బరీ సాగును ఉపాధి హామీ పథకంలో చేర్చాలి. సైడ్ వాల్స్ రేకులు, రొటోవేటర్, కట్టర్లు, విజేత పౌడర్లు అందజేయాలి. గత టీడీపీ ప్రభుత్వంలో 90శాతం రాయితితో డ్రిప్ ఏర్పాటు చేశారు. వైసీపీ పాలనలో అవన్నీ ఎత్తివేశారు. మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం రావడంతో ఇస్తారని ఆశిస్తున్నాం.

- రాఘవేంద్ర, పట్టురైతు, తెనగల్లు

---

## సమగ్రశిక్ష ఏపీసీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నాగరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

**అనంతపురం విద్య, జూలై 31:** సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్(ఏపీసీ)గా నాగరాజు నియమితులయ్యారు. బుధవారం ఆయన ఏపీసీగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీసీగా అదనపు బాధ్యతలతో పనిచేస్తున్న జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి ఇటీవలే రాజంపేటకు బదిలీపై వెళ్లారు. దీంతో సుమారు వారం రోజులకుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఏపీసీ పోస్టు ఖాళీపడిన తర్వాత డీఈఓ వరలక్ష్మికి ఏపీసీగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి నా...ఆమె తీసుకోలేదని సమాచారం. దీంతో ఆఖరికి ఏడీ నాగరాజుకు జిల్లా కలెక్టర్ ఏసీపీగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సమగ్రశిక్ష ప్రాజక్టులోని సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతిభకు వందనం

### అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన వందన



జాతీయ పతాకంతో వందన

**ఉరవకొండ, జూలై 31:** అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో విడపనకల్లుకు చెందిన ఎం వందన సీనియర్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. ఫస్ట్ ఓపెన్ ఇంటర్నేషనల్ గేమ్స్, నింజా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో భూటాన్‌లో అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలు ఈ నెల 26నుంచి 28 వరకూ జరిగాయి. భూటాన్‌కు చెందిన బాక్సర్ నస్రీన్‌తో జరిగిన పోటీల్లో వందన ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించింది. ఈమె ఒకటి నుంచి 10 వరకు విడపనకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించింది. ఇంటర్, డిగ్రీ ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో బాక్సింగ్‌లో రాణించింది. 2016 నుంచి అనంతపురంలోని బాక్సింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఆర్డీటీలో శిక్షణ పొందింది. ఢిల్లీలో రెండుసార్లు గోల్డ్ మెడల్ సాధించింది. రాష్ట్రస్థాయిలో ఆరు సార్లు గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. వందన విజయం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## చీనీ టన్ను రూ.17వేలు



**అనంతపురం రూరల్, జూలై 31:** అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలు, కనిష్ఠంగా రూ.2,500లు, సరాసరి రూ.11,500లతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 785టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ పే ఆర్డర్లను ఏర్పాటు చేయాలి

- డీఆర్ఎంకు ఏఐఆర్ఆర్ఎఫ్ వినతి

**గుంతకల్లు, జూలై 31:** రైల్వే విశ్రాంత ఉద్యోగులకు, ఫ్యామిలీ పెన్షనర్లకు ఏడో వేతన సంఘం సిఫారసుల మేరకు ఇవ్వాల్సిన పెన్షన్ పే ఆర్డర్లను వెంటనే ఏర్పాటు చేయాలంటూ ఆలిండియా రిటైర్డు రైల్వేమెన్ ఫెడరేషన్ (ఏఐఆర్ ఆర్ఎఫ్) నాయకులు డీఆర్ఎంను కోరారు. ఏఐఆర్ఆర్ఎఫ్ కార్యాలయంలో బుధవారం ఉదయం రైల్వే పింఛనుదారుల డివిజనల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. సదస్సులో ఈ సంఘ జోనల్ అధ్యక్షుడు ఎస్ శ్రీధర్, జోనల్ కార్యదర్శి యుగంధర్ మాట్లాడుతూ సెకెండరీ ఫ్యామిలీ పెన్షన్లను వెంటనే ఏర్పాటు చేయాలని, యూఎంఐడీ మెడికల్ కార్డులు లేనివారికి వెంటనే కార్డులను జారీ చేయాలని, పింఛనుదారులందరికీ మాన్యువల్ పాసులను యాజమాన్యం జారీ చేయాలని, రెఫరల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం పింఛను దారుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ డివిజనల్ రైల్వే మేనేజరు విజయ కుమార్, సీనియర్ డివిజనల్ పర్సనల్ మేనేజరు జయశంకర్ చౌహాన్‌ను కలిసి వినతిపత్రాలను అందజేశారు. రైల్వే పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని డీఆర్ఎం హామీ ఇచ్చినట్లు ఈ సంఘ నాయకులు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐఆర్ఆర్ ఎఫ్ గుంతకల్లు రైల్వే డివిజన్ అధ్యక్షుడు జయంత్ కుమార్, కార్యదర్శి వీ సుంకప్ప, అదనపు డివిజనల్ కార్యదర్శి సత్యరాజ్, వివిధ రైల్వే బ్రాంచ్‌ల చైర్మన్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



డీఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఆర్ఆర్ఎఫ్ నాయకులు

## తహసీల్దార్ల పోస్టింగ్‌కు తాత్కాలిక బ్రేక్

**అనంతపురం టౌన్, జూలై 31:** తహసీల్దార్ల పోస్టింగ్‌లకు తాత్కాలిక బ్రేక్ పడింది. ప్రభుత్వం కొత్త నిబంధనల మేరకు పోస్టింగ్‌లు ఇవ్వాలని కలెక్టర్లకు రెవెన్యూశాఖ కమిషనర్ నుంచి మంగళవారం రాత్రి ఆదేశాలు వచ్చినట్లు కలెక్టరేట్ వర్గాల సమాచారం. కొత్త నిబంధనల ప్రకారం ప్రస్తుతం అనంత జిల్లా, శ్రీసత్యసాయిజిల్లాకు వచ్చిన తహసీల్దార్లందరికీ ఉమ్మడి అనంతపురం జిల్లాను యూనిట్‌గా తీసుకొని పోస్టింగ్ ఇవ్వాల్సి ఉన్నట్లు తెలిసింది. అనంత జిల్లాకు చెందిన 35మందికి బుధవారం పోస్టింగ్ ఇవ్వడానికి కలెక్టరు మంగళవారం రాత్రికి ప్రక్రియ పూర్తి చేశారు. అయితే కొత్తగా ఉమ్మడి జిల్లా యూనిట్‌గా పోస్టింగ్ ఇవ్వాలని ఆదేశాలు రావడంతో ఆప్రక్రియ ఆగిపోయిం దని చెబుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం అనంత జిల్లాకు 35మంది, శ్రీసత్యసాయి జిల్లాకు 23మంది తహసీల్దార్లు తిరిగి చేరుకున్నారు. అనంతజిల్లాలో 31మండలాలు, శ్రీసత్యసాయి జిల్లాలో 32మండలాలు ఉన్నా యి. రెండుజిల్లాలకు కలిపి 58మంది మాత్రమే ఉన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలోనే 10మంది తహసీల్దార్లకు పోస్టులు ఖాళీగా ఉన్నాయంటున్నారు. ఇపుడు వచ్చిన తహసీల్దార్లను ఎన్నికలకు ముందు ఏజిల్లాలో, ఏ నియోజక వర్గంలో పనిచేశారో అక్కడ నియమించకూడదని, అలాగే సొంత రెవెన్యూ డివిజన్‌లో కూడా నియమించకూడదనే నిబంధన తప్పకుండా పాటించాలని రెవెన్యూ కమిషనర్ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఇపుడు వచ్చిన 58మందిని ఉమ్మడి జిల్లాఅనంతను యూనిట్‌గా తీసుకొని 63మండలాలలో పోస్టింగ్ ఇవ్వనున్నారు.

ఈప్రక్రియ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు కలిసి నిర్వహించాల్సి ఉందని రెవెన్యూ వర్గాలు అంటున్నాయి. సీఎం చంద్రబాబు గురువారం శ్రీ సత్యసాయి జిల్లాకొస్తున్నారు. దీంతో ఆ జిల్లా కలెక్టరు ఆకార్యక్రమం ముగిసేవరకు ఈతహసీల్దార్ల వ్యవహారం గురించి పట్టించుకో వడం కష్టం. శుక్ర లేదా శనివారం తహసీల్దర్ల పోస్టింగ్‌లపై ఇద్దరు కలెక్టర్లు మాట్లాడుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇదే జరిగితే శనివారం లేదంటే వచ్చే సోమవారం రోజుకి తహసీల్దార్ల పోస్టింగ్‌లపై అధికారికంగా ఉత్తర్వులు వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## అసైన్డ్‌పై విచారణ జరిపించాలి: సీపీఎం

**అనంతపురం కల్చరల్, జూలై 31:** అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై సమగ్ర విచారణ జరిపించి, కబ్జాదారులను కఠినంగా శిక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం హడావుడిగా తెచ్చిన జీఓ నెం.596 భూ చట్ట సవరణ పేదల భూములను పెద్దలు కబ్జా చేసేందుకు తోడ్పడిందని విమర్శించారు. భూ చట్ట సవరణ ప్రకారం 20 ఏళ్లకు పైగా అసైన్డ్ భూములు సాగుచేసుకుంటున్న పేదలకు శాశ్వత భూ హక్కు కల్పిస్తామని నాడు వైసీపీ నేతలు చెప్పారన్నారు. అసైన్డ్ భూములను సాగు చేసుకోవాల్సిన దళిత, గిరిజనులను తరిమేసేందుకు రాజకీయ నాయకులకు ఈ చట్ట సవరణ ఉపయోగపడిందని తెలిపారు. అనంతపురం జిల్లాలో 2.23లక్షల ఎకరాల అసైన్డ్ భూములను దళిత, గిరిజన, బలహీన వర్గాల వారు మాత్రమే సాగు చేసుకోవాల్సి ఉందని, కానీ ఆపేదల భూములను గతం నుండి అక్రమంగా అనేక రూపాల్లో పెత్తందార్లు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఈ అక్రమాలను చట్టబద్ధం చేసుకునేందుకే గత సంవత్సరం చివర్లో వైసీపీ ప్రభుత్వం జీఓ తెచ్చిందని పేర్కొన్నారు. భూచట్ట సవరణను ఉపయోగించుకుని జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్లలో దాదాపు 24వేల ఎకరాల అసైన్డ్ భూములను నాటి అధికారపార్టీ నాయకులు, గ్రామ పెత్తందారులు తమ పేర్లమీదకు మార్చుకున్నట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**అనంతపురం విద్య, జూలై 31:** సమగ్రశిక్ష ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం ప్రకటనలో కోరారు. సమగ్రశిక్షలోని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ), గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీఓ), అసిస్టెంట్ ఏఎంఓ (జనరల్), అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ),అసిస్టెంట్ అలెస్కో, అసిస్టెంట్ సీఎంఓ, అసిస్టెంట్ ఐఈడీ, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టుకు అర్హత గల స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరకాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న స్కూల్ అసిస్టెంట్లు తమ దరకాస్తులతోపాటు విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలు, సర్వీసు పుస్తకం జిరాక్స్ కాపీలు జత చేయాలన్నారు. ఏఎంఓ, జీసీడీఓ(మహిళా అభ్యర్థులు మాత్రమే) పోస్టులకు 8 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసుకొన్న వారు అర్హులన్నారు. ఇతర పోస్టులకు 5 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న వారు అరులని తెలిపారు. దరకాస్తులను http://samagrashikshaatpblogspot.com నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి ఆగస్టు 9 సాయంత్రం 5 గంటలలోగా సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

## అంతర్జాతీయ క్రికెట్ పోటీలకు గుత్తి విద్యార్థులు




విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం

**గుత్తి, జూలై31:** గుత్తి ఆర్ఎస్‌లోని సెయింట్ మేరీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు విక్టర్, మనోజ్ భారత క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రిజినా, హెచ్ఎం ఎల్ఈల్ హర్షి తెలిపారు. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన కానిస్టేబుల్ బొజ్జప్ప కుమారుడు విక్టర్, బెల్దారీ సురేష్ కుమారుడు మనోజ్ ఈ ఏడాది మార్చిలో అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా క్రికెట్ పోటీల్లో ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఏప్రిల్30 హైదరాబాదులో జరిగిన జాతీయ స్థాయి క్రికెట్ పోటీలో రాణించి భారతజట్టుకు ఎంపికయ్యారు. నేపాల్‌లో ఈనెల 3నుంచి 6 వరకు జరిగే అంతర్జాతీయ క్రికెట్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

## మళ్లీ పెరిగిన వరద

- టీబీ డ్యాం 33 గేట్లు ఎత్తివేత
- 74,095 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



డ్యాం నుంచి దిగువకు వెళ్తున్న వరద జలాలు

**బొమ్మనహాళ్, జూలై 31:** తుంగభద్ర జలాశయానికి మళ్లీ వరద పోటెత్తుతోంది. దీంతో 33 క్రస్ట్‌గేట్లు (25 గేట్లు మూడు అడుగులు, మరో 8 గేట్లు ఒక్క అడుగు మేర)ను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. 1,23,381 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదికి, 9379 క్యూసెక్కులను కాలువలకు విడుదల చేశారు. జలాశయం పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఆ వరదనీరు వచ్చి జలాశయంలోకి చేరుతున్నా యి. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 74,095 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో కాలువలకు వదిలే నీటితో కలిపి 1,32,760 క్యూసెక్కులు ఉంది. డ్యాం కెపాసిటీ 1633 అడుగులతో 105 టీఎంసీలు ఉండగా బుధవారం సాయంత్రానికి 1631.30 అడుగులతో 99.040 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగిలిన నీటిని బోర్డు అధికారులు దిగువకు వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105 కి.మీ. వద్ద 1138 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

## వేతనాల కోసం పెన్నా కార్మికుల ధర్నా



రోడ్డుకు సైకిళ్లు అడ్డం పెట్టి ఫ్యాక్టరీ వద్ద కార్మికుల నిరసన

**యాడికి, జూలై 31:** వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ బోయరెడ్డిపల్లి గ్రామం వద్ద ఉన్న పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు బుధవారం ధర్నా చేపట్టారు. పలువురు కార్మికులు మాట్లాడుతూ పెన్నాసిమెంట్ ఫ్యాక్టరీ అధికారులు మూడునెలలుగా తమకు వేతనాలు చెల్లించలేదన్నారు. వేతనాలు ఇస్తే గానీ జీవనం గడవని తమకు వేతనాలు చెల్లించకుండా ఫ్యాక్టరీ అధికారులు తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారన్నారు. పెన్నాసిమెంట్స్ ఫ్యాక్టరీ ప్రధాన గేటును మూసివేసి, ఫ్యాక్టరీకి వెళ్లేదారిలో సైకిళ్లను అడ్డుపెట్టి ధర్నా నిర్వహించారు. ఫ్యాక్టరీ ఉద్యోగులు ఎవరూ లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. తమకు వేతనాలు చెల్లించేదాకా విధులకు వెళ్లేదిలేదని, ఉద్యోగులను ఎవరిని లోపలికి వెళ్లనివ్వమని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు పెన్నాసిమెంట్స్ ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి అధికారులు, కార్మికులతో వివరాలు ఆరాతీశారు. కార్మికులకు సర్దిచెప్పే ప్రయత్నాలు చేశారు. తమకు రావాల్సిన బకాయిలు మొత్తం చెల్లించేదాకా ధర్నాను కొనసాగిస్తామని కార్మికులు తెలిపారు.

## సెప్టెంబరు 14న జాతీయ లోక్‌అదాలత్

**అనంతపురం క్రైం, జూలై 31:** అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ తెలిపారు. ఉమ్మడి జిల్లా కోర్టుల పరిధిలోని అన్ని రకాల కోర్టులలో పెండింగ్‌లో ఉన్న మోటారు వాహనాల ప్రమాద కేసులు, సివిల్, చెక్ బౌన్సు కేసులు, కుటుంబ తగాదాలు(విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారన్నారు. సంబంధిత కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఉమ్మడి జిల్లాలో డీఎస్పీల బదిలీ

**అనంతపురం క్రైం, జూలై 31:** ఉమ్మడి జిల్లాల పరిధిలో పలువురు డీఎస్పీల బదిలీ అయ్యారు. అనంతపురం పీటీసీ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావును తూర్పు గోదావరి దిశ మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. రాష్ట్రవ్యాప్తం గా 96మంది డీఎస్పీలను ప్రభుత్వం బుధవారం బదిలీ చేసింది. 14వ బెటాలి యన్ డీఎస్పీ దామోదర్‌రావును విజయవాడ సెంట్రల్ ఏసీపీగా బదిలీ చేశారు. అప్పా అటాచ్డ్ పీటీసీ డీఎస్పీ హుస్సేన్‌పీరాను జమ్మలమడుగు డీఎస్పీగా బదిలీ చేశారు. జిల్లాలోని గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డిని, కళ్యాణదుర్గం డీఎస్పీ బిశ్రీనివాసులు, శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్, పెనుకొండ డీఎస్పీ బాజిజాన్ సైదా పోలీస్‌హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు ఎస్పీ, అటాచ్డ్ నెల్లూరు ట్రాఫిక్ డీఎస్పీ ఆళ్ల శ్రీనివాసులును పెనుకొండ డీఎస్పీగా నియమించారు. గుంతకల్లు, కళ్యాణదుర్గం, పుట్టపర్తి డీఎస్పీలుగా ఇంకా ఎవరినీ నియమించలేదు. రెండో జాబితాలో మరింత మంది డీఎస్పీల బదిలీలు జరగనున్నాయి.

---

## అమ్మపాలే అమృతం

### నవజాత శిశువుకు శ్రేయస్కరం: వైద్యులు

### నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

**అనంతపురం టౌన్, జూలై 31:** తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానం. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమైనవి. తల్లిపాలు తాగే చిన్నారుల్లో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుంది. అయితే పలు కారణాల వల్ల శిశువులకు తల్లిపాలు అందడం లేదు. దీంతో నవజాత శిశువులు అనారోగ్యాలబారిన పడుతున్నారు. మరి కొందరు మరణిస్తున్నారు. అనంతజిల్లాలో వైద్యశాఖ లెక్కల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో కలిపి ఏటా 35వేల మంది తల్లులు బిడ్డలకు జన్మనిస్తున్నారు. అందుకే ప్రభుత్వాలు తల్లిపాల ఉపయోగాల గురించి అవగాహన కల్పిస్తున్నాయి. ప్రతి ఏటా ఆగస్టు 1 నుంచి వారం రోజుల పాటు తల్లి పాలు వారోత్సవాలు నిర్వహిస్తూ బిడ్డకు తల్లిపాల ఆవశ్యకత గురించి తెలియజేస్తున్నాయి.




తల్లి పాల వారోత్సవాల సందర్భంగా కలెక్టరు ఏర్పాటు చేయించిన పోస్టర్

### ముర్రుపాలు ఎంతో మేలు

ఏ తల్లి అయినా ప్రసవించిన(సాధారణ కాన్పు, లేదా సిజేరియన్ అయినా) గంటకు తప్పనిసరిగా బిడ్డకు పాలు పట్టించాలి. తొలి మూడు రోజుల పాటు తల్లి నుంచి వచ్చే పాలు పసుపు రంగులో ఉంటాయని వీటినే ముర్రుపాలు అంటారని వైద్యులు చెబుతున్నారు. ఈ పాలలో ఇమ్యునోగ్లోబిన్స్ అధికంగా ఉంటాయని, వీటిని తాగించడం వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొంటున్నారు. తల్లి దగ్గర బిడ్డ ఎంత ఎక్కువ తాగితే అంత ఎక్కువగా పాలు ఉత్పత్తి పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

### ఇద్దరికీ ప్రయోజనమే..

తల్లిపాలు బిడ్డకు పట్టించడం వల్ల ఇద్దరికీ మేలు జరుగుతుందని చెబుతున్నారు. బిడ్డకు సరైన పోషకాహారం లభించి, సులువుగా జీర్ణమవుతుంది. రోగ నిరోధకశక్తి పెరుగుతుంది, అలర్జీ ప్రభావాలు తగ్గుతాయి. మానసిక వికాసం జరుగుతుంది. అలాగే తల్లికి కూడా పలు ప్రయోజనాలు కలుగుతాయి. ప్రసవం నొప్పుల నుంచి త్వరగా కోలుకుంటారు. త్వరగా బరువు తగ్గుతారు. తల్లీబిడ్డల మధ్య బంధం దృఢమవుతుంది. తల్లులకు కేన్సర్, మూత్రపిండాల జబ్బులు వంటివి వచ్చే ప్రమాదాలు దూరమవుతాయి.



**పౌష్టికాహార లోపంతోనే...**

తల్లులు సరైన ఆహారం తీసుకోకపోతే ఆ ప్రభావం పిల్లలపై పడుతుంది. ఆస్పత్రికి ప్రసవాలకు వస్తున్న చాలామంది తల్లులు బలహీనత, రక్తహీనతతో వస్తున్నారు. అలాంటి వారికి పుట్టే పిల్లలు చాలా బరువు తక్కువతో అనారోగ్యంగా పుడుతున్నారు. అలాంటి పిల్లలను ఎస్ఎన్‌సీ యూ(స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్)లో ఉంచి వైద్యసేవలు అంది స్తున్నాం, అయినా చాలామంది పిల్లలు త్వరగా కోలుకోవడంలేదు. అందుకే గర్భం దాల్చినప్పటి నుంచే పౌష్టికాహారం తీసుకోవాలి. మామూలు సమయంలో కంటే గర్భిణిగా ఉన్నప్పుడు 10నుంచి 12కేజీల అదనపు బరువు పెరగాలి. అప్పుడే కడుపులో ఉన్నబిడ్డ ఎదుగుదల బాగున్నట్లు గుర్తించాలి.

- డాక్టర్ రవికుమార్, చిన్నపిల్లల విభాగాధిపతి, జిల్లా ఆస్పత్రి



**అవగాహన పెంపునకే...**

తల్లి పాల విశిష్టతను తల్లులకు తెలిపి వారిలో అవగాహన కల్పించడం కోసమే తల్లిపాలు వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. తల్లి పాలు పట్టించడంలో ఇప్పటికీ అపోహలు ఉన్నాయి. తొలి మూడురోజులు వచ్చే ముర్రుపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం. బాలింతలు నీళ్లు ఎక్కువ తాగరాదనే అపోహ కూడా ఉంది. ఇది సరైంది కాదు. ప్రతి రోజు కనీసం మూడు లీటర్ల నీరు తాగాలి. ఒకలీటర్ పాలు తీసుకోవాలి. అపుడు తగినంత పాలు పిల్లలకు అందుతాయి. బాలింతలు అన్నిరకాల ఆహార పదార్థాలు తీసుకోవచ్చు. గురువారం నుంచి వారంపాటు అంగన్‌వాడీలు ఇతరులతో కలిసి జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

- డాక్టర్ ఈబీ దేవి, డీఎం హెచ్ఓ



**జాగ్రత్తలు పాటించాలి**

తల్లికి పాలు ఇవ్వడం ఎంత ముఖ్యమో, ఆపిల్లలకు పాలిచ్చే విధానం కూడా అంతే ముఖ్యం. కూర్చొని బిడ్డకు పాలు పట్టించాలి. పాలు తాగినవెంటనే పిల్లలను పడుకోబెట్టకూడదు. కొద్దిసేపు భుజంపై వేసుకొని తట్టాలి. త్రేన్పులు వచ్చిన తర్వాతే పడుకోబెట్టాలి. అపుడు ఎలాంటి ప్రమాదం ఉండదు. పాలను ఇష్టానుసారం తాపించి, వెంటనే ఊయలలో పడుకోబెడితే పిల్లల నోట్లోకి, ముక్కుల్లోకి పాలువచ్చి పొలమారుతుంది. అదేసమయంలో ఊపిరితిత్తుల్లోకి వెళ్లి ఊపిరి ఆడక ప్రాణాలు పోయే అవకాశాలు ఉంటాయి.

- డాక్టర్ హేమలత, డిప్యూటీ ఆర్ఎంఓ, జీజీహెచ్


చికిత్స పొందుతున్న వ్యక్తితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

## డయాలసిస్ యంత్రాల ప్రారంభం

కదిరి, జూలై 31: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా వచ్చిన నాలుగు డయాలసిస్ యంత్రాలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం ఆసుపత్రిలో 11 డయాలసిస్ యంత్రాలున్నాయని, వాటిని 20కు పెంచాలని సూచించారు. టీడీపీ పార్ట్ మిషన్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యనిర్వాహక కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, పర్వీన్‌బాను, కార్యకర్తలు, జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**వైద్యశిబిరం:** తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లిలో సాయినికేతన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే కందికుంట ప్రారంభించారు. అలాగే గుండువారిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, కదిరి బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు స్కూల్ కిట్లను అందించారు.

**పండ్ల మొక్కల పంపిణీ**

**గాండ్లపెంట:** మండలంలోని కటారుపల్లి పంచాయతీలోని కటారుపల్లి క్రాస్‌లోని రెడ్స్ సంస్థ రైతులకు అందిస్తున్న పండ్ల మొక్కలను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ బుధవారం పంపిణీ చేశారు. రైతుల కోసం రెడ్స్‌సంస్థ పండ్ల మొక్కలు అందిస్తోందని, ఉద్యానవన పంటల సాగు రైతులు ఆర్థికంగా ఎదగడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతి రైతు పండ్ల మొక్కలను నాటుకుని, సంరక్షించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో కదిరి నియోజకవర్గ ప్రాంతంతోపాటు, నల్లమాడ మండలంలో మొక్కలు అందిస్తున్నట్టు సంస్థ అధినేత భానుజా తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి విద్యా సంస్థల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి, దాసిరెడ్డి, తుంగ వేణుగోపాల్‌రెడ్డి, నరసింహులు, కేశవరెడ్డి, రెడ్స్ సంస్థ సభ్యులు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

## నీటి సరఫరా బంద్

ధర్మవరం, జూలై 31: పట్టణంలో శుక్ర, శనివారాల్లో తాగునీటి సరఫరాను బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీపీనరవరావు సంబంధించిన పార్లపల్లి వాటర్ వర్క్స్ పైపులైన్‌లో పనులు ఉన్నందున రెండురోజులు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. కావున పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు.

## నేడు కేన్సర్ స్ర్కీనింగ్ క్యాంపు

పుట్టపర్తి, జూలై 31: స్థానిక శ్రీసత్యసాయి పాలియేటివ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ స్ర్కీనింగ్ క్యాంప్‌ను గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెద్దకమ్మవారిపల్లి రోడ్డులోని ఆస్పత్రిలో బెంగళూరు రామయ్య మెడికల్ కాలేజ్ సహకారంతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 30 సంవత్సరాలు పైబడిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## పాఠశాలలకు స్థల దాత పేరు పెట్టండి

ముదిగుబ్బ, జూలై 31: స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల, బాలికల పాఠశాల, ప్రాథమిక పాఠశాలలకు స్థలదాత ఉపేంద్రం సుబ్బరాయ పేరు పెట్టాలని కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్ ఓ ప్రకటనలో కోరారు. ఉపేంద్రం సుబ్బరాయ ముదిగుబ్బ పట్టణం నడి ఒడ్డున కోట్లు విలువ చేసే స్థలాన్ని పేద విద్యార్థుల చదువు నిమిత్తం ప్రభుత్వానికి దానం చేశాడని, ఆ స్థలదాత పేరు నేటి తరానికి తెలియడని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ పాఠశాలకు స్థలదాత పేరు రాయించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొత్తచెరువు, జూలై 31: మండలంలోని అప్పలవాండ్లపల్లిలో బుధవారం రాత్రి ఆగి ఉన్న పాల ఆటోను ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో వన్నూరప్పపల్లి గ్రామానికి చెందిన సాయి కుమార్ (25) అక్కడికక్కడే మరణించాడు. ఇతను కియాలో విధులు నిర్వహిం చేవాడు. ఇతనికి ఏడు నెలల క్రితం వివాహమైంది. ప్రస్తుతం ఆతని భార్య పుట్టపర్తిలో ఉంది. బుధవారం రాత్రి బైక్‌లో వన్నూరప్పపల్లి నుంచి పుట్టపర్తికి బయలుదేరాడు. అప్పల వాండ్లపల్లి వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న పాల ఆటోను ఢీకొన్నాడు. దీంతో సాయి తలకు, ఛాతికి బలమైన గాయమై అక్కడికక్కడే మరణించాడు. స్థానికులు ద్వారా సమాచారం అందుకున్న సీఐ రాజారమేశ్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. సాయికుమార్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నారు.

## ముష్టూరు సర్పంచ్‌గా ముసలప్ప


సర్పంచ్ ముసలప్పను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

బత్తలపల్లి, జూలై 31 : మండలంలోని ముష్టూరు పంచాయతీ సర్పంచ్‌గా ముసలప్ప బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. గత సర్పంచ్ అనారోగ్య కారణాలతో రాజీనామా చేయడంతో టీడీపీ నాయకుడు, ఉపసర్పంచ్ ముసలప్ప సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. సర్పంచులు ప్రజలకు జవాబు దారీగా పని చేయాలని సూచించారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో తిరుగుతూ ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివ ప్రసాద్, టీడీపీ నాయకులు కరణం సూర్యప్రకాష్‌రావు, చల్లా శ్రీనివాసులు, జక్కంపూటి నాగభూషణ, హేమంత్, నాగేలి లక్ష్మీనారాయణ, సురేంద్రనాయుడు, సాంబ పాల్గొన్నారు.

## టీచర్లను నియమించండి


ఎంఈఓ కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం రూరల్, జూలై 31: మండలంలోని పోతుకుంట జిల్లాపరిషత్ పాఠశాలలో తగినంత మంది ఉపాధ్యాయులను నియమించాలని టీడీపీ నాయకులు ఎంఈఓ గోపాల్ నాయక్ వినతిపత్రం అందించారు. బుధవారం ఆ నాయకులు పోతుకుంట జిల్లాపరిషత్ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడాన్ని గుర్తించారు. వెంటనే వారు ధర్మవరంలోని ఎంఈఓ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థులు పలు సబ్జెక్టుల్లో వెనుకబడ్డారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో టీడీపీ మండల మహిళ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, నాయకులు గువ్వలరమేష్, రవి, చిట్టానారాయణస్వామి, ఐటీడీపీ రాము పాల్గొన్నారు.

## జలధికి పేర్లు

నంబులపూలకుంట, జూలై 31: మండలంలోని సోమరాజుకుంటలో బుధవారం ఘనంగా జలధి నిర్వహించారు. మొహరం సందర్భంగా చావిడిలో కొలువు దీరిన పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. మంగళవారం రాత్రి అగ్నిగుండంలో యువత అల్లాయ్ తొక్కారు. బుధవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం చేశారు. పురవీధుల్లో పీర్లను ఊరేగించారు. పీర్లకు దక్షిణ చదివించి, మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు.

## రోటరీక్లబ్ కార్యవర్గం ఏర్పాటు

కదిరి, జూలై 31: స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేశవరెడ్డి, సీవీ వెంకటేశ్వర్లు, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, మేడా ప్రభాకర్ హాజరయ్యారు. నూతన అధ్యక్షుడుగా సాయినిహేన్, కార్యదర్శిగా నామానాగార్జున, కోశాధికారిగా నేతి అబియన్ ఎంపికయ్యారు.



# బాబోయ్.. వీధి కుక్కలు..!

- పదుల సంఖ్యలో రోడ్లపై సంచారం
- దాడుల్లో మరణిస్తున్న గొర్రెలు, మేకలు
- కాపరులకు రూ.లక్షల్లో నష్టం
- వీధుల్లోకి రావడానికి జంకుతున్న జనం
- రాత్రి వేళల్లో పరిస్థితి మరీ ఘోరం


ఓబులదేవరచెరువులోని ప్రధాన రహదారిలో సంచరిస్తున్న వీధి కుక్కలు


వీధికుక్కల దాడిలో మరణించిన గొర్రెలు (ఫైల్)

ఓబులదేవరచెరువు, జూలై 31: ఇటీవల కాలంలో వీధి కుక్కల సంఖ్య బాగా పెరిగింది. పదుల సంఖ్యలో రోడ్లపై సంచరిస్తూ.. ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. గ్రామాల్లో ఈ పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. పిల్లలను ఒంటరిగా బయటకు పంపడానికి తల్లిదండ్రులు జంకుతున్నారు. ఇటీవల కొండకమర్ల గుడ్డిబావి వీధిలో వీధికుక్కలు చిన్నారులపై దాడికి ప్రయత్నించగా.. గమనించిన స్థానికులు ఆ చిన్నారులను కుక్కల బారి నుంచి కాపాడారు. కొండకమర్ల, ఓడీ చెరువు ప్రాంతాల్లో కొంతమంది చికెన్ దుకాణదారులు చికెన్ వ్యర్థాలను పడవేయడంతో వాటిని తినడానికి అలవాటు పడిన కుక్కలు.. ఎక్కడ చిన్నారులపై దాడిచేస్తాయో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల మండలంలోని దిగువపల్లిలో ఇటీవల జెరిపేటి అంజనప్పకు చెందిన గొర్రెల మందపై వీధికుక్కలు దాడిచేశాయి. దీంతో పది గొర్రెలు మృతిచెందగా రూ.లక్ష నష్టం జరిగింది. గతంలో కూడా మండలంలోని వెంకటాపురం పంచాయతీలోని నారప్పగారిపల్లిలో మల్లప్ప గొర్రెల మందపై వీధికుక్కలు దాడి చేశాయి. వీధి కుక్కల దాడిలో ఇలా పశువులు చనిపోతుండటంతో కాపరులు రూ. లక్షలు నష్టపోతున్నారు. వీధికుక్కలు ఇష్టానుసారం రోడ్లపై తిరుగుతుండటంతో ద్విచక్రవాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. ద్విచక్రవాహనదారులు ప్రయాణిస్తున్న సమయంలో కుక్కలు ఒక్కసారిగా వాహనాలకు అడ్డు వస్తుండటంతో వాహనదారులు కిందపడి గాయపడుతున్నారు. మరికొన్ని సమయాల్లో వీధికుక్కలు మూకుమ్మడిగా ద్విచక్ర వాహనదారులను వెంటపడుతుండటంతో.. వాటి నుంచి తప్పించుకోవడానికి అతి వేగంగా వెళ్తూ.. ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్రవాహనదారులు వీధుల్లో వెళ్లడానికి భయపడే పరిస్థితి నెలకొంది. ఇలా కుక్కకాటుకు గురైన వారు గ్రామీణులు సూది మందు కోసం మండల కేంద్రాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలకు పరుగులు తీయాల్సి వస్తోంది. అక్కడ ఆ మందు అందుబాటులో లేకుంటే ఇక జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిందే. అధికారులు స్పందించి వీధి కుక్కల బారి నుంచి తమను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

### పిల్లలను పంపాలంటే భయం



కుక్కల భయంతో పిల్లలను బయటకు పంపాలంటేనే భయంగా ఉంది. గుడ్డిబావి వీధిలో పిల్లలపై వీధి కుక్కలు దాడిచేయడానికి వచ్చాయి. అక్కడున్నవారు ఆ పిల్లలను రక్షించారు కాబట్టి సరిపోయింది. లేకుంటే.. ఇప్పటికైనా ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి వీధికుక్కల సమస్యను తప్పించాలి.

\- జిలాన్, కొండకమర్ల

### గొర్రెలనూ వదలడంలేదు



ఇటీవల కుక్కల దాడులు అధికమవుతున్నాయి. గొర్రెలను సైతం కుక్కలు వదలడంలేదు. మా గ్రామంలో ఇటీవల కుక్కల దాడిలో పది గొర్రెలు చచ్చిపోయాయి. అప్పటినుంచి గొర్రెల కాపరులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గొర్రెల కాపరులు వెంటపడుతున్నా వస్తేనే భయపడుతున్నారు. మరింత నష్టం జరగకముందే కుక్కలను అరికట్టాలి.

\- జెరిపేటి అంజనప్ప, దిగువపల్లి

### చర్యలు చేపడతాం

వీధి కుక్కల నివారణకు చర్యలు చేపడతాం. మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పశువైద్యుల సహకారంతో కుక్కలను గ్రామాల్లో నివారించడానికి చర్యలు తీసుకుంటాం.

\- రాజశేఖర్, ఈఓఆర్డీ

# గ్రామాల అభివృద్ధే కర్తవ్యం

తాగునీటి సమస్య రానివ్వకండి : ఎమ్మెల్యే సింధూర


వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాజీ మంత్రి

బుక్కపట్నం, జూలై 31: గ్రామాల అభివృద్ధే కర్తవ్యమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు మనమంతా జవాబుదారీగా పనిచేద్దామన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. చిలకలగుట్టపల్లి, మదిరేబైలు, గోపాలపురం, యాదలంకపల్లి, మదిరెడ్డిపల్లితండా, ఎర్రంపల్లి, జిఆర్ కొట్టాల తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు ప్రజల నుంచి తనకు ఫిర్యాదులు అందాయని, తక్షణం ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. గ్రామాల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వీడాలన్నారు. ఆగస్టు 1న పింఛన్ల పంపిణీని ఓ పండుగలా నిర్వహించాలని చెప్పారు. మండల కేంద్రంలోని ఈడిగవాండ్లపల్లి కాలనీలో మురుగునీరు ప్రవహిస్తోందని కాలనీవాసులు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ :** బుక్కపట్నంలోని ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థులతో ముచ్చటించారు. అంగన్‌వాడీకేంద్రాలను పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి ఆరాతీశారు.

**అర్హులందరికీ పథకాలు**

**పుట్టపర్తి:** అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్నదే టీడీపీ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెడబల్లి వ్యవసాయ సహకార సొసైటీ కార్యాలయంలో ఎస్సీ రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పరికరాలను అందజేశారు. బుక్కపట్నం మండలానికి చెందిన 46 మంది, పుట్టపర్తి మండలానికి చెందిన 120 మందికి రూ.10 వేల విలువైన ప్లాస్టిక్ డ్రమ్ములు, టార్పాలిన్ పంపిణీ చేశారు. వీటి కోసం మధ్యవర్తికి డబ్బులు ఇచ్చి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, ఎంపీడీఓలు నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసులు, కన్వీనర్లు విజయ్‌కుమార్, మలిరెడ్డి, బీజేపీ కన్వీనర్లు బాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీరామిరెడ్డి, శ్రీరామ్‌నాయక్, రంగయ్య పాల్గొన్నారు.

**'జర్నలిస్టు హెల్త్ స్కీం' ప్రీమియం చెల్లిస్తాం:** పుట్టపర్తి నియోజక వర్గంలోని జర్నలిస్టులకు చెందిన హెల్త్ స్కీంకు ప్రీమియమ్ తామే చెల్లిస్తామని ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. గతంలోనూ ఇలా పలుమార్లు ప్రీమియం డబ్బు తాము చెల్లించామని తెలిపారు.

## నేడు పింఛన్ల పంపిణీ

ధర్మవరం, జూలై 31: పట్టణంలోని 22వ వార్డులో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)లో గురువారం నిర్వహించే తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం, ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమాలకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ హాజరవుతున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. కావున ఉదయం 9 గంటలకు సిద్దార్థ థియేటర్ సమీపంలోని ఓవర్ బ్రిడ్జి వద్దకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు తరలిరావాలని కోరారు.

**నల్లమాడ :** మండలంలోని ఎద్దులవాండ్లపల్లి గ్రామంలో గురువారం నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పాల్గొంటున్నట్లు మండల కన్వీనర్ మైలే శివశంకర్ బుధవారం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రైవేటు పాఠశాలకు షోకాజ్ నోటీసు

గాండ్లపెంట, జూలై 31: మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు ఎంఈఓ క్రిష్ణానాయక్ బుధవారం తెలిపారు. ఆ పాఠశాలలో 8వ తరగతి ఇంగ్లీష్ మీడియం నిర్వహణకు అర్హత లేకపోయినా.. నిర్వహిస్తున్నట్లు తమ తనిఖీలో తేలిందన్నారు. దీంతో ఆ పాఠశాలకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు చెప్పారు. అనుమతి లేకుండా ప్రైవేటు పాఠశాలలు నిర్వహించరాదని, అలా నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## సిలబస్ మార్పుతో నష్టం

ధర్మవరం, జూలై 31: పదో తరగతి విద్యార్థులకు మారిన సిలబస్ ఏ మాత్రం ఉపయోగపడేలా లేదని, తీవ్ర నష్టం వాటిల్లుతుందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిప్పేని జయచంద్రారెడ్డి అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. సోషల్ టెక్స్టుబుక్‌లో 258 పేజీలుంటే 167 పేజీలు యూరోపియన్ చరిత్రకు కేటాయించి రాష్ట్ర చరిత్రకు తక్కువ పేజీలు ఇవ్వడం విడ్డూరం అన్నారు. 9వ తరగతి హిందీ పుస్తకం చాలా ఇబ్బందికరంగా ఉందని, ఉపాధ్యాయులకు కూడా అర్థం చేసుకోలేని ఉత్తర భారతదేశం మాండలికాలు విద్యార్థులను, ఉపాధ్యాయులను గందరగోళానికి గురిచేస్తున్నాయన్నారు. భౌతిక శాస్త్రంలో మూలకాల వర్గీకరణ, పరమాణు నిర్మాణం, రసాయన బంధం తదితర పాఠాలు తొలగించడం దారుణమన్నారు. గణిత సబ్జెక్టులో భవిష్యత్తు పోటీ పరీక్షలకు సిద్ధపడే విద్యార్థులకు ఉపయోగపడే విధంగా లేవన్నారు. ఇప్పటికైనా పాత పాఠ్యాంశాలను తిరిగి చేర్చాలని కోరారు. కార్యక్రమంలో ధర్మవరం జోన్ యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, లక్ష్మయ్య, అమరనారాయణరెడ్డి, రాంప్రసాద్, హరికృష్ణ, సాయిగణేశ్, రామాంజనేయులు, ఆదిశేషు, జనార్దన్‌బాబు, వెంకటకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్ఎంపీ క్లినిక్‌ల తనిఖీ

గాండ్లపెంట, జూలై 31: మండలంలోని మల్లమీదపల్లి, కటారుపల్లి, గాండ్లపెంట, రెక్కమాను గ్రామాల్లో ఆర్ఎంపీ వైద్యుల ప్రథమ చికిత్స కేంద్రాలను వైద్యాధికారి మారుతీమహేశ్వర్ బుధవారం తనిఖీ చేశారు. ఆయనవెంట సీనియర్ అసిస్టెంటు ఫిరోజ్‌ఖాన్, విజయ్, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

# వేధింపులతోనే ఆత్మహత్యాయత్నం

బాధ్యులను అరెస్టు చేయాలి
సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు


ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

ఓబులదేవరచెరువు, జూలై 31: అంగన్‌వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ.. వీరప్పగారిపల్లి గ్రామానికి చెందినమినీ అంగన్‌వాడీ కార్యకర్త నాగమణిని అంజనేయులు వేధించడంతోనే ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. చాలాచోట్ల అంగన్ వాడీలపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, వాటిని అపాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ జాకీరాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ర్యాలీగా అంబేద్కర్ సర్కిల్ వరకు వెళ్లి.. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, జీవీఎల్ నరసింహులు, సాంబశివ, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు ఆశీర్వదమ్మ, రంగమ్మ, మణెమ్మ, క్రిష్ణమ్మ, అరుణమ్మ, లక్ష్మీదేవి, సీఐటీయూ కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

**ధర్మవరం :** పుట్టపర్తి నియోజకవర్గం ఓబులదేవరచెరువు ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని వెంటనే అరెస్టుచేయాలని సీఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అధికారిణి లక్ష్మీదేవికి వినతిపత్రం అందజేశారు. ఓడీసీకి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త నాగమణిని కొందరు రాజకీయ నాయకులు వేధింపులకు గురిచేశారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కో కన్వీనర్ అయూబ్‌ఖాన్, సీఐటీయూ సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా, ఎల్ ఆదినారాయణ, సీపీఎం పట్టణ కార్యదర్శి శేషాపల్లి మారుతి, నరసింహులు, అంగన్‌వాడీ నాయకులు పాల్గొన్నారు.

**కదిరిఅర్బన్:** తమకు రక్షణ కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ రవితేజకు అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంగన్‌వాడీ కార్యకర్తలపై రాజకీయ ఒత్తిళ్లు, దాడులు సర్వసాధారణ మయ్యాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జీవీఎల్ నరసింహులు, జగన్నాథన్, ముస్తాక్, అంజనేయులు, ఫజిల్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు మణిశ్రీ, సుజాత, లక్ష్మీదేవి, పద్మావతి, భాగ్యమ్మ, మాధవి, సుమిత్ర పాల్గొన్నారు.

## సబ్ జైలులో న్యాయవిజ్ఞాన సదస్సు

కదిరిరీగల్, జూలై 31: స్థానిక సబ్‌జైలులో మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ న్యాయాధికారి ఎస్ జయలక్ష్మి బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయాధికారి మాట్లాడుతూ.. పలు కారణాల వల్ల కేసుల్లో ఇరుక్కుని జైలులో మగ్గుతున్న వారిలో మార్పు కోసమే తమ ప్రయత్నమని పేర్కొన్నారు. జైలుకు వచ్చిన తర్వాత ఇంటి వద్ద పరిస్థితులు, కుటుంబ సభ్యులు పడే ఆవేదనను జైలులో ఉన్నవారు అర్థం చేసుకోవాలన్నారు. సబ్‌జైలులో భోజనం, వైద్యం తదితర సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. లోక్ అదాలత్ ద్వారా అందే న్యాయసహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది లోకేశ్వరరెడ్డి, సబ్‌జైలు సూపరింటెండెంట్ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి జయలక్ష్మి

### ఎరువుల దుకాణాల తనిఖీ

అనంతపురం న్యూటౌన్: బత్తలపల్లిలోని సంజయ్ ట్రేడర్స్ పర్టిలైజర్స్‌లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీ నిర్వహించారు. ప్రిన్సిపల్ సర్టిఫికెట్ చూపించకపోవడం, రికార్డులను, స్టాక్ నిల్వలకు తేడా ఉండటం, స్టాక్ రిజిస్టర్ నమోదు చేయకపోవడం.. తదితర లోపాలను గుర్తించారు. దీంతో 92.25 లీటర్ల రూ.69,390 విలువ చేసే పెస్టిసైడ్స్‌కు స్టాప్ సేల్ నోటీసు జారీ చేయించారు. దాడుల్లో ఎస్సీ మునిరామయ్య, సీఐ వెంకటరమణ, ఏఈ వాసుప్రకాష్, ఏజీ శివప్రసాద్, ఎంఏఓ ఓబిరెడ్డి పాల్గొన్నారు.


ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

## బకాయి వేతనాలు చెల్లించండి

ఆకులు తింటూ సత్యసాయి వాటర్ ప్రాజెక్టు కార్మికుల నిరసన

పుట్టపర్తి, జూలై 31: తమకు ఐదు నెలలుగా జీతాలు అందలేదని, కుటుంబ పోషణ భారంగా మారిందని, వెంటనే వేతనాలు మంజూరు చేయాలని సత్యసాయి వాటర్ ప్రాజెక్టు కార్మికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం హనుమాన్ సర్కిల్‌లో వాటర్ ట్యాంకు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆకులు తింటూ కార్మికులు వినూత్నంగా నిరసన తెలిపారు. యూనియన్ నాయకుడు మధుసూదన్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో 532 మంది కార్మికులు ఉన్నారని, వారికి ఐదు నెలలుగా జీతాలందక కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. ఆయినా గ్రామీణ ప్రజలకు తాగునీటి సరఫరా ఆగిపోకుండని విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఒక పక్క మోటార్లు, పైపులు మరమ్మతులు చేయకపోవడంతో పనిభారం పెరిగింది అన్నారు. ఎల్అండ్‌టీ సంస్థ నిర్వహణలో రూ.220 కోట్ల ఉన్న బడ్జెట్ ను గత ప్రభుత్వం రూ.103 కోట్లకు తగ్గించిందని, దీంతో నిర్వహణ సక్రమంగా లేదని అన్నారు. కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకుని వాటర్ ప్రాజెక్టు నిర్వహణ చేపట్టాలని, ఐదు నెలల జీతం, ఏడు నెలల పీఎఫ్, ఈఎస్ఐ నిధులను ఖాతాలో జమచేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీనివాసులు, ప్రభు, నరేశ్ చంద్ర, సోము, నాగరాజు పాల్గొన్నారు.

## 'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోండి

ధర్మవరంరూరల్, జూలై 31: ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అంబుడ్స్‌మన్ శివారెడ్డి సూచించారు. బుధవారం మండలం లోని నిమ్మలకుంట గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చింతనపల్లిలో జరుగుతున్న నీటి నిల్వ కందకాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ.. ఉపాధిహామీ పనులకు ప్రతిరోజు రోజుకు రూ.300లు కూలీ వేతనం ప్రభుత్వం ఇస్తోందని, కొలతలకు అనుగుణంగా పనిచేస్తే పూర్తి కూలీ వేతనం లభిస్తుందని అన్నారు. బ్యాంకు ఖాతాలకు తప్పనిసరిగా ఆధార్‌లింకు చేయించుకోవాలని, కూలి సొమ్ము బ్యాంకు ఖాతాల్లోకే వస్తాయని అన్నారు. కొత్తగా వివాహం అయినా వారు నూతన జాబ్‌కార్డు కొరకు దరఖాస్తు చేసుకుంటే వెంటనే జాబ్‌కార్డు మంజూరు చేస్తామన్నారు. అనంతరం గతంలో పనిచేసిన కూలీ డబ్బులు రాలేదని పలువురు కూలీలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నిధుల మంజూరుకాగానే ఖాతాల్లో జమ అవుతాయని, కూలి డబ్బులపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఆయనవెంట ఏపీఓ అనిల్‌కుమార్‌రెడ్డి, టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉన్నారు.

**తాడిమర్రి :** తాడిమర్రి మండలంలోని చిల్లవారిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ మణిమంజరి పరిశీలించారు. ఆమె కూలీల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడూ బిల్లులు చెల్లించేలా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నిమ్మలకుంటలో కూలీలతో మాట్లాడుతున్న జిల్లా అంబుడ్స్‌మన్

## సక్రమంగా పింఛన్ల పంపిణీ చేపట్టండి: ఎంపీడీఓ

**హిందూపురం(సోమందేపల్లి), జూలై 31 :** ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని సక్రమంగా చేపట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆయన బుధవారం సోమందేపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో పంచాయతీ, గ్రామ సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సిగ్నల్ సమస్య ఉంటే ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

## 5న మండల సమావేశం

**అగళి, జూలై 31 :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల ఐదో తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యు లు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హాజరవుతారని ఏఓ తెలిపారు.

## కర్ణాటక సీఎంను కలిసిన ఎంపీ బీకే



కర్ణాటక సీఎం సిద్దరాయమ్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బీకే పార్థసారథి

**పెనుకొండ, జూలై 31:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను బుధవారం డిల్లీలో ఎంపీ బీకే పార్థసారథి మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్దరామయ్యకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువకప్పి సత్కరించారు. కర్ణాటక మంత్రి మహదేవప్ప, మాజీ మంత్రి రేవణ్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు నేరం: సీడీపీఓ

**పెనుకొండ రూరల్, జూలై 31:** బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ పెనుకొండ సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. రొద్దం మండలంలోని తురకలాపట్నం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం బాల్యవివాహాలు అరికడదాం, ఆడబిడ్డలను కాపాడుదాం అనే కార్యక్రమాన్ని ఆర్డీటీ మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో సీడీపీఓ పాల్గొని మాట్లాడారు ఆర్డీటీ మహిళావిభాగం టీమ్ లీడర్ ఆదినారాయణ, సూపర్‌వైజర్ సుజాతమ్మ, ప్రధానోపాధ్యాయులు శివరాం, శివయ్య పాల్గొన్నారు.

## పాఠశాలల్లో న్యూట్రిషన్ కిచెన్ గార్డెన్లు: ఎంఈఓ

**హిందూపురం అర్బన్, జూలై 31:** ప్రభుత్వం పాఠశాలల్లో న్యూట్రిషన్ కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టిందని ఎంఈఓ గంగప్ప పేర్కొన్నారు. అందుకు అనువుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కాయగూరలు, ఆకుకూరలు పండించి వాటిని వినియోగించే విధంగా ప్రణాళిక రచించిందన్నారు. అందుకు కావలసిన ఎరువులు, విత్తనాలను వ్యవసాయ శాఖాధికారులు అందజేస్తారని తెలిపారు. పూలకుంటలోని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, ఎంజీఎం పాఠశాలల్లో న్యూట్రిషన్ కిచెన్ గార్డెన్ ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించారు.

## దోమల నివారణకు ఫాగింగ్

**గుడిబండ, జూలై 31:** దోమల నివారణ కోసం బుధవారం గుడిబండలో సర్పంచ్ కరుణాకర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్ ఆధ్వర్యంలో ఫాగింగ్ చేపట్టారు. దోమలు విపరీతంగా ఉండటంతో వాటిని అరికట్టేందుకు రెండు రోజుల పాటు ఫాగింగ్ చేశారు.

## జలధికి తరలిన పీర్లు



పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

**హిందూపురం(పరిగి), జూలై 31 :** పరిగి మండల పరిధిలోని పెద్దరెడ్డిపల్లిలో బుధవారం పీర్ల జలధి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం పీర్లను గ్రామంలో ఊరేగించి, భక్తులు చక్కెర చదివింపులు చేశారు. సాయంత్రం జలధికి తరలించారు. ఈ కార్యక్రమం తెలుగు యువత జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుతో మహిళ మృతి



యశోదమ్మ మృతదేహం

**మడకశిర(అమరాపురం), జూలై 31:** అమరాపురం మండల పరిధిలోని హేమావతి పంచాయతీ వద్రహట్టి గ్రామానికి చెందిన వడ్డెర యహోదమ్మ(45) అనే మహిళ పాముకాటుతో మృతిచెందింది. వద్రహట్టికి చెందిన వడ్డెర యహోదమ్మ బుధవారం ఉదయం గడ్డికోయడానికి పొలానికి వెళ్లింది. ఆ సమయంలో పాము కాటు వేసింది. ఆమె ఇంటికి వచ్చి అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గత మూడు సంవత్సరాల క్రితం ఆమె భర్త అనారోగ్యానికి గురై చనిపోయాడు. తల్లి మృతితో ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆ పిల్లలకు ఆర్థిక సహాయం అందించాలని బంధువులు కోరారు.

## మద్యం కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు శిక్ష

**పెనుకొండ రూరల్, జూలై 31:** కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి పెనుకొండ మెజిస్ట్రేట్ మూడేళ్ల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు. పెనుకొండ మండలం శెట్టిపల్లికి చెందిన హనుమంతు, రవినాయక్ కలిసి 2020లో కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుం డగా పట్టుబడ్డారు. వారిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి బొజ్జప్ప నిందితులకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.2లక్షలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. వారిని సబ్‌జైలుకు తరలించినట్లు తెలిపారు.

# రెండు లారీలు ఢీ

● ఒకరి మృతి ● ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న లారీలు

**పెనుకొండ రూరల్, జూలై31:** మండలంలోని వెంకటరెడ్డిపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై పుట్టపర్తికి వెళ్లే బ్రిడ్జి సమీపంలో మంగళవారం రాత్రి ఎదురెదురుగా రెండు లారీలు ఢీకొన్నాయి. ప్రమాదంలో డ్రైవర్ గొల్ల శ్రీనివాసులు(30) మృతిచెందగా, మరో ముగ్గురికి గాయాలైనట్లు కియ ఏఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా మాలూరు తాలూకాకు చెందిన లారీ డ్రైవర్ గొల్ల శ్రీనివాసులు, క్లీనర్ ముస్తఫా కలిసి కోలార్ నుంచి రాయచూర్‌కు లారీలో టమోటా లోడ్‌తో బయలు దేరారు. ఈ క్రమంలో పెనుకొండ సమీపంలో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ సమయంలో వాహనం ఎడమ నుంచి కుడివైపునకు వెళ్లి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు బంగాళదుంపలతో వెళ్తున్న లారీని ఢీకొంది. ప్రమాదంలో టమోటా లారీ డ్రైవర్ శ్రీనివాసులు అక్కడి కక్కడే మృతిచెందగా, రెండు లారీల క్లీనర్లు ముస్తఫా, శీను, బంగాళాదుంపల లారీ డ్రైవర్ శ్రీరామ్ గాయపడ్డారు. వారిని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్రీనివా సులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు.

# కన్నుల పండువలా వేణుగోపాలస్వామి రథోత్సవం



మేరెడ్డిపల్లి వేణుగోపాలస్వామి

**గోరంట్ల, జూలై 31:** మండలంలోని మేరెడ్డిపల్లిలో వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని బుధవారం కన్నులపండువలా నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన బ్రాహ్మణులు తమ ఇలవేల్పు అయిన మేరెడ్డిపల్లి వేణుగోపాలస్వామిని అనాదిగా ఆరాధిస్తూ వస్తున్నారు. ప్రతి ఏటా ఆషాఢమాసంలో వారు గ్రామానికి వచ్చి స్వామికి విశేష పూజలు నిర్వహి స్తారు. ఆషాఢమాసం రోహిణి నక్షత్రం రోజున రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ముందురోజు మంగళవారం ఆలయంలో హోమాలు నిర్వహించి, వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే బుధవారం అర్చకులు మంజు, హరిస్వాములు మూలవిరాట్‌ను అభిషేకించి, ప్రత్యేకంగా అలకరించారు. అర్చన, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం రుక్మిణి, సత్యభామ సమేత ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఉంచి ఊరేగించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు కలశాలతో రాగా, చౌడేశ్వరీదేవిని పల్లకిలో మోస్తూ రథోత్సవంలో పాల్గొన్నారు. బ్రాహ్మణమహిళలు కోలాటమాడారు. బ్రాహ్మణులు, గ్రామస్థులు కలిసి కట్టుగా రథాన్ని లాగారు. గ్రామంలోని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



రథోత్సవంలో కలశాలను తీసుకెళుతున్న మహిళలు



కోలాటమాడుతున్న మహిళలు

# నీటి పనులకు వైసీపీ కౌన్సిలర్ల అడ్డంకి





మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఇంద్రజ, సభ నిర్వహించాలంటున్న టీడీపీ కౌన్సిలర్



మధ్యలోనే వెళ్లిపోతున్న వైసీపీ కౌన్సిలర్లు

● మధ్యలోనే వెళ్లిపోయిన వైసీపీ సభ్యులు

**హిందూపురం, జూలై 31:**
పట్టణానికి నీరందించే గొల్లపల్లి పైప్‌లైన్‌కు సంబంధించి మరమ్మతు పనుల కోసం ఆమోదం తెలపాలని చైర్‌పర్సన్ ఇంద్రజ కోరగా... వైసీపీ సభ్యులు వాయిదావేస్తూ మధ్యలోనే వెళ్లిపోయారు. స్థానిక మున్సిపల్ కార్యలయంలో బుధవారం చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలను చదువుతున్న సమయంలో ఆరో అంశం వచ్చే సరికి వైసీపీ కౌన్సిలర్ ఆసిఫ్ మాట్లాడుతూ... అధికారులు మరమ్మతు పనులకు మించి ఎస్టిమేషన్ వేశారన్నారు. అసలు వారు తయారుచేసిన ఎస్టిమేషన్ మరమ్మతులకా లేక కొత్తవాటిని కొనుగోలుచేసేందుకా అని ప్రశ్నించారు. దీనిపై వైసీపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఇదే సందర్భంలో టీడీపీ కౌన్సిలర్ రమేష్ మాట్లాడుతూ... అభివృద్ధి పనులకు అడ్డుపడకూడదన్నారు. ఆ నిధులు 2019కి సంబంధించినవని, ఇప్పుడు ఆమోదించకపోతే వెనక్కుపోయే అవకాశం ఉందన్నారు. పట్టణానికి నీటి సమస్య పరిష్కారం కావాలంటే సభ్యులు ఆమోదించాలన్నారు. కానీ వైసీపీ సభ్యులు మాత్రం తాము ఒప్పుకునేది లేదని తెలిపారు. సివిల్ వర్కులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు వస్తే తప్ప ఏపీసీ గ్రాంట్‌కు సంబంధించి పనులు చేపట్టకూడదని వైసీపీ కౌన్సిలర్లు సభ నుంచి వెళ్లిపోయారు. అనంతరం టీడీపీ కౌన్సిలర్ రమేష్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఎన్నో అక్రమాలు జరిగాయని, అప్పుడు విచారణకు డిమాండ్ చేయకుండా ఇప్పుడు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. అక్రమాలు జరిగి ఉంటే దానిపై కమిటీ వేయించడానికి తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి అవకతవకలు జరిగి ఉంటే చర్యలు తీసుకునేలా తాము కోరుతామన్నారు. అజెండాలో 36అంశాలుండగా 11అంశాలు మినహా మిగిలిన వాటికి ఆమోదం తెలుపుతున్నట్లు చైర్‌పర్సన్ ఇంద్రజ ప్రకటించారు.

## పంటసాగులో యాజమాన్య పద్ధతులు పాటించండి


రైతులకు జిల్లా వ్యవసాయాధికారి సూచన



పత్తిసాగులో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ సుబ్బారావు

**పెనుకొండ రూరల్, జూలై 31 :** రైతులు సాగుచేసిన పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బరావు తెలిపారు. ఆయన బుధవారం రొద్దం మండలంలోని పెద్దమంతూరులో రైతు వెంకప్ప పొలంలో సాగు చేసిన పత్తిపంటను పరిశీలించారు. మెగ్నీషియం సల్ఫేడ్ 20గ్రాములను లీటరు నీటిలో కలిపి ఎకరా పంటకు పిచికారి చేయాలన్నారు. రసం పీల్చే పురుగులు ఆశించినట్లయితే 5మి.మీ. వేపనూనె ఇమిడక్లోప్రిడ్ 0.4మి.మీ. ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ స్వయంప్రభ, ఏఓ నివేదిత, వ్యవసాయ సహాయకులు యోగేష్, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డుపైనే మురుగునీటి ప్రవాహం



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

**హిందూపురం(సోమందేపల్లి), జూలై 31:** సోమందేపల్లిలో గోరంట్ల రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో పాదచారులు, వాహన దారులు ఇబ్బందిపడుతున్నారు. హోటల్ నిర్వాహకులు, గృహయజమానులు మురుగు నీటిని రోడ్డుపైకి వ దులుతున్నారని, ఆ నీరు రోడ్డుపై ప్రవహిస్తోందని స్థానికులు వాపోతు న్నారు. అయినా పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహ రిస్తున్నారని మండిపడుతున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధు లు విజృంభిస్తున్నాయి. పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంతో వ్యాధులకు మరింత ఊతమిస్తుందని అంటున్నారు. అధికారులు సత్వరం తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## అంగన్‌వాడీలపై వేధింపులు ఆపాలి

**హిందూపురం అర్బన్, జూలై 31:** అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందిపై రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని అంగన్‌వాడీల యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, సీఐటీయూ నాయకులు రాము డీటీ వెంకటేశ్వర్లు, సీడీపీఓ రెడ్డిరమణమ్మకు బుధవారం వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓడీసీ మండలం వీరప్పగారిపల్లి మినీ అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి రాజకీయ వేధింపులు భరించలేక ఇటీవలే ఆత్మహత్యానికి పాల్పడిన విషయం విదితమేఅన్నారు. వేధింపులు ఆపకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో లేపాక్షి, చిలమత్తూరు, హిందూపురం మండలాలతోపాటు నాయకులు శోభమ్మ, సెక్టార్ లీడర్లు శిరీష, వరలక్ష్మీ, వాణి, శ్రీదేవి, ఉమా ఉన్నారు.

**హిందూపురం(సోమందేపల్లి):** అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఆపక పోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీఐటీయూ, అంగన్‌వాడీల యూనియన్ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక ఐసీడీఎస్, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందించారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీలకు రక్షణ కల్పించాలని, దాడులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీదేవి, నాగమణి, ప్రమీళ, రాజగోపాల్, అరుణ, పద్మావతి, భాగ్యమ్మ పాల్గొన్నారు.

## అసైన్డ్ భూచట్టాన్ని రద్దుచేయాలి: సీపీఎం

**హిందూపురం(సోమందేపల్లి), జూలై 31:** అసైన్డ్ భూచట్టాన్ని ఉపసంహరించుకోవాలని, అన్యాక్రాంతమైన దళిత, గిరిజనుల భూములను పేదలకు పంచిపెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం సీపీఎం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'అసైన్డ్‌కు ఎసరు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. గత వైసీపీ పాలకులు అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కు కల్పిస్తామని చెప్పి, చట్టసవరణ ద్వారా అడ్డుగోలుగా 596జీఓతో భూ అక్రమాలకు తెరలేపారన్నారు. పెనుకొండ, హిందూపురం, చిలమత్తూరు మండలాల్లో వేలాది ఎకరాలను స్వాహా చేశారని ఆరోపించారు. అన్యాక్రాంతమైన భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. లేకపోతే సీపీఎం జెండాలు పాతి పేదలకు పంచుతామన్నారు.

## దాత సహకారంతో ప్రమాదబీమా

**హిందూపురం అర్బన్, జూలై 31:** పట్టణం, మండలంలోని విలేకరులకు రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి ప్రమాదబీమా చేయించారు. ఆయనను బుధవారం ప్రెస్‌క్లబ్ కమిటీ తరఫున సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రామాంజినేయులు సూచన మేరకు తాను సొంత డబ్బుతో విలేకరులకు ప్రమాద బీమా సొమ్ము చెల్లిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు విలేకరులు పాల్గొన్నారు.

## గీతాభిషేకం పుస్తకావిష్కరణ

**పెనుకొండ, జూలై 31:** ప్రముఖ వ్యాపారవేత్త, రచయిత ఇండియన్ గిన్నీస్‌ఆఫ్ రికార్డ్ గ్రహీత పచ్చిపులుసు సూర్య నారాయణ రచించిన ఉజ్జయిని మహం కాళేశ్వర్ గీతాభిషేకం పుస్తకాన్ని మంగళవారం రాత్రి స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ కల్యాణమండపంలో ఆవిష్కరించారు. జిల్లా రచ యితల సంఘం జాబిలి చాంద్‌బాష అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తకం ముద్రణకు సహకరించిన ప్రముఖ వ్యాపార వేత్త యాడికి నాగరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. పుస్తకంలోని పాటల క్యాసెట్‌ను ముఖ్య అతిధిగా హాజరైన ఎస్కేయూ తెలుగు ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. ఆత్మీయ అతిథి రామబ్రహ్మంతోపాటు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుధాకర్‌గుప్త, తదితరులు పాల్గొన్నారు.

# 414రోజులకు చేరిన అన్న క్యాంటీన్



అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న మంత్రి సవిత

**పెనుకొండ టౌన్, జూలై 31:** పేదలకు కడుపునిండా నాణ్యమైన భోజనం అందించాలన్న ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి మంత్రి సవిత ఆధ్వర్యంలో చేపట్టిన అన క్యాంటీన్ ప్రారంభించి బుధవారానికి 414రోజులకు చేరింది. ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌లో ఆమె బుధవారం పేదలకు అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా మంత్రి మా ట్లాడుతూ గత వైసీపీ పాలనలో అన్న క్యాంటిన్ పెట్టనీయకుండా ఎన్నో అడ్డంకులు సృష్టించారని అన్నారు. అయినా మనోధైర్యంతో రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తూ వచ్చామన్నారు. ప్రతిరోజూ దాదాపు 400మంది వరకు ఇందులో భోజనం చేసి వెళ్తుంటారన్నారు. దీనిని నిరంతరాయంగా కొనసాగిస్తామన్నారు.

## లక్ష్య సాధనకు కష్టపడాలి: మంత్రి సవిత



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న మంత్రి

**పెనుకొండ, జూలై 31:** విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవాలని బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలను ఆమె బుధవారం సాయంత్రం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేనివిధంగా... తమ ప్రభుత్వం విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని కళాశాల ప్రారంభం కాగానే ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు అందజేస్తోం దన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి నారాలోకేశ్ విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు శంకర్‌నాయక్, హఫీజ్, టీడీపీ నాయకులు కన్వీనర్ శ్రీరాములు, మాధవనాయుడు, త్రివేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి పర్యటన ఇలా...

**పెనుకొండ, జూలై 31:** రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత గురువారం పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఉదయం 7గంటలకు వెంకటరెడ్డిపల్లిలో, 8గంటలకు కురుబవాండ్లపల్లి, 9గంటలకు గుట్టూరులో ఆమె పాల్గొంటారని పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీరాములు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

## ఉపాధి హామీ పనిదినాలు పెంచండి: మంత్రి

**పెనుకొండ టౌన్, జూలై 31:** గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు పనిదినాలు పెంచాలని బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అధికారులకు సూచించారు. మంత్రి బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్, డీడబ్ల్యూఎంఏ శాఖల అధికారులతో పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడకానీ తాగునీటి సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో మినరల్ వాటర్ అందేలా ప్రత్యేక పథకాలు తయారు చేయాలన్నారు. ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్‌ఈఈ మల్లికార్జున, డీడబ్ల్యూఎంఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయేంద్ర పాల్గొన్నారు.

## ఉపాధి పనులపై ఎంపీడీఓ సమీక్ష

**మడకశిర(అమరాపురం), జూలై 31:** అమరాపురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ భాస్కర్, ఏపీఓ జగదీష్ ఉపాధి హామీ సిబ్బంది ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పర్యవేక్షణ, కొత్తగా వచ్చినటువంటి ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇవ్వాలని టెక్నికల్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో ఉపాధి హామీలో కూలీలను పెంచాలని, వారికి తగినన్ని పనిదినాలు కల్పించాలన్నారు. జేఈ జగదీష్, టెక్నికల్‌అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

**రొళ:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ ప్రసాద్ ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకం కోసం ఆసక్తి ఉన్న చిన్న, సన్నకారు రైతుల నుంచి వారంలోగా దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి కూలీల శాతం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవకుడికి ప్రశస్తి

**పావగడ, జూలై 31 :** సమాజసేవకుడు హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్‌కు కన్నడ అభివృద్ధి సాధికార, కల్పవృక్ష యువనగర గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కల్పవృక్ష ప్రశస్తిని అందించి సన్మానించారు. డాక్టర్ పురుషోత్తం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కంపలప్ప, డాక్టర్ సంతోష్, రవికుమార్, నరసేగౌడ, సత్యలోకేష్, పరమేశ్ తదితరులు కలిసి ఘనంగా సన్మానించారు. ఆయన సేవారంగాల్లో మరింత ముందడుగువేసి సమాజాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.

## నేడు బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా

**పావగడ, జూలై 31:** బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం తాలూకా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ తాలూకా అధ్యక్షుడు హనుమంతరాయ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల పేరుతో ఎస్సీ, ఎస్టీ నిధులను దుర్వినియోగం చేసి, ఆ సామాజికవర్గాలకు తీవ్ర అన్యాయం చేసిందని ఈ నేపథ్యంలో బీఎస్పీ తరుపున ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. సంఘ సంస్థలు మద్దతు పలికి విజయవంతం చేయాలని కోరారు.